**సమస్యలుంటే సాక్షికి చెప్పండి**

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**98490 98674**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవరాట



ఉత్సవ రాటవేస్తున్న గౌరీ సేవా సంఘం సభ్యులు

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 65వ వార్డు బాపూజీ కాలనీలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం గౌరీ పరమేశ్వరుల మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాటను ప్రతిష్ఠించారు. ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. నవంబర్ 2వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్తీక మాసం నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మద్దాల అప్పారావు, ఆడారి శంకర్, కొణతాల మల్లేష్, వేణుగోపాల్, గణేష్ పాల్గొన్నారు.

### పార్టీ పటిష్టానికి కృషి చేయండి



మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

**అగనంపూడి:** వైఎస్సార్‌సీపీ పటిష్టానికి మరింత కృషి చేసి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆకాంక్షించారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఆయన్ను కలిసి వార్డులోని సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, ముద్దపు మురళీమోహన్, సబ్బవరపు ఈశ్వరరావు, బుల్లెట్ రమణ, దాసరి అప్పడు, మార్పు గోవింద్ పాల్గొన్నారు.

### భూముల పరిశీలన



వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**అక్కిరెడ్డిపాలెం:** విశాఖ డెయిరీ యాజమాన్యం అక్కిరెడ్డిపాలెం గ్రామంలోని సుమారు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిందంటూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం గాజువాక రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ రామారావు, ఆర్ఐ మహేష్, గ్రేడ్ – 1 వీఆర్వో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలతో సావాసం!



ఆకులు, చెత్తా చెదారంతో నిండిపోయిన మురుగు కాలువ



క్వార్టర్స్ పరిసరాల్లో తుప్పుపట్టిన వాహనాలు

- ఆటోనగర్ ఫేస్ – 1 క్వార్టర్స్‌లో వసతుల లేమి
- కాలువలు శిథిలం
- పరిసరాలు అధ్వానం

**అక్కిరెడ్డిపాలెం:** పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో ఓల్డ్ ఎస్ఆర్ఎంటీ సమీపంలోని ఫేజ్ – 1లోని పలు విభాగాల క్వార్టర్స్ వాసులు సమస్యలతో సావాసం చేస్తున్నారు. మురుగు, అపరిశుభ్ర వాతావరణంలో జీవిస్తున్నారు. డ్రైన్లు (మురుగుకాలువలు)అస్తవ్యస్తంగా మారాయి. ఏళ్ల తరబడి వీటి నిర్వహణను జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో నివాసితులు అవస్థలు పడుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

ఫేజ్ – 1లో ఈడబ్ల్యూఎస్‌లో 1 నుంచి 48 నివాసాలు, ఎల్ఐజీలో 1 నుంచి 16 నివాసాలు, ఎంఐజీలో 1 నుంచి 14 నివాసాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన మురుగు కాలువలు పూడికలతో నిండిపోయాయి. చాలా చోట్ల మురుగు కాలువలు శిథిలావస్థకు చేరాయి. పూడికలను తొలగించేందుకు సంబంధిత సిబ్బంది రాకపోవడంతో తీవ్ర దుర్గంధం, దోమల వ్యాప్తితో ఇబ్బందులు పడుతున్నారు. ఈడబ్ల్యూఎస్ క్వార్టర్ల మధ్య నున్న కాలువ పూర్తిగా చెట్ల ఆకులతో నిండిపోయింది. పూడికలు తొలగించే పనులు చేపట్టకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది.

**శిథిల వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు**

దీంతో పాటు క్వార్టర్స్‌లోని ఖాళీ ప్రదేశాల్లో కొందరు అనధికార వ్యక్తులు మరమ్మతులకు గురైన పలు రకాల వాహనాలను సంవత్సరాల కొద్ది పార్కింగ్ చేసి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నివాసితులు వాపోతున్నారు. వాహనాల్లో రాత్రి సమయంలో పలు అసాంఘిక కార్యక్రమాలు జరగుతున్నాయని చెబుతున్నారు. కాలనీలో సమస్యలను జీవీఎంసీ అధికారుల దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినా స్పందన లేదని వాపోతున్నారు.

**ప్రతిపాదనల్లోనే...**

కాగా క్వార్టర్స్‌లో కాలువలు శిథిలం కావడంతో నూతన కాలువలు నిర్మించాలన్న అంశం ప్రతిపాదనలకే పరిమితం అయింది. ఓపెన్ డ్రైన్ల స్థానంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారని కాలనీ వాసులు తెలిపారు. అయితే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపుల నిర్మాణం జీవీఎంసీ చేపట్టాలా, క్వార్టర్స్ నిర్వాసితులు చేపట్టాలన్న అంశంపై సందిగ్ధత నెలకుందని ప్రతినిధులు అంటున్నారు. నూతనంగా ఏర్పడిన అసోసియేషన్ ప్రతినిధుల ద్వారా కాలనీ సమస్యలను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళతామని చెబుతున్నారు.



శిథిలమైన కాలువ

### కాలువల పరిస్థితి అధ్వానం



క్వార్టర్స్‌లో మురుగు కాలువల పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. కాలువల్లో పూడిక తీత పనులకు జీవీఎంసీ సిబ్బంది రావడం లేదు. కాలువలు మురుగుతో నిండిపోయి దుర్గంధం, దోమల వ్యాప్తితో ఇబ్బందులు పడుతున్నాం. పలు చోట్ల కాలువలు ధ్వంసం అయ్యాయి. మురుగు వెళ్లని పరిస్థితి. సంబంధిత అధికారులు పట్టించుకోవాలి.

–హైమావతి, ఆటోనగర్.

### అనధికారిక వ్యక్తుల ప్రవేశం



క్వార్టర్స్‌లో అనధికార వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాళ్లకు సంబంధించిన తుప్పుపట్టిన వాహనాలను ఖాళీ ప్రాంతంలో సంవత్సరాల తరబడి ఉంచేస్తున్నారు. వీటి వల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయి. మురుగు కాలువల నిర్వహణ పెద్ద సమస్యగా మారింది. వీటి నిర్వహణకు జీవీఎంసీ అరకొరగా స్పందిస్తున్నారు. అధికారులు సమస్యలపై దృష్టి సారించాలి.

– శ్రీలక్ష్మి, ఆటోనగర్

## దీపావళి శోభ



దీపావళి దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

**పెదగంట్యాడ:** దీపావళి సంబరాలకు పెదగంట్యాడ సిద్ధమైంది. పూజా సామగ్రి, మందుగుండు కొనుగోలుదారులతో మార్కెట్‌లో సందడి నెలకొంది. ఆదర్శ గ్రౌండ్‌లో బాణసంచా విక్రయాలు జోరందుకున్నాయి. ఇక్కడ 50 దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అడిగితే మీరు ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోరని నిర్లక్ష్యంగాసమాధానం చెబుతున్నారని ప్రజలు మండిపడ్డారు.

## స్వచ్ఛతతో పర్యావరణ పరిరక్షణ



ఆటోనగర్‌లో మొక్కలు నాటుతున్న పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ అధికారులు

**అక్కిరెడ్డిపాలెం:** ఆటోనగర్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై ప్రత్యేక ప్రచార కార్యక్రమం 4.0ను నిర్వహించారు. ఆటోనగర్ డి – బ్లాక్‌లోని సజ్జాస్ విష్ణుటెక్ ఇంజినీరింగ్ వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ అధికారులు మొక్కలు నాటారు. చీపుర్లు చేత పట్టి రోడ్లను శుభ్రపరిచారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ కరోనా సమయంలో మరణాలను అధిగమించడానికి కారణం ప్రతీ ఒక్కరు స్వచ్ఛతా ప్రమాణాలు పాటించడమే అన్నారు. స్వచ్ఛత హీసేవా నియమాలపై ఎంఎస్ఎంఈ అధికారులు, పారిశ్రామిక వేత్తలచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రొగ్రాం ఆర్డినేటర్ ఏడీ బి.ప్రభాకర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీ గ్రేడ్ –1 చంద్రమౌళి, శ్రీను అప్పికొండ, వినోద్, సుబ్బారావు, సన్యాసిరావు, ఐలా కమిషనర్ కిషోర్, చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), ప్రధానకార్యదర్శి చీకటి సత్యనారాయణ, మాజీ ప్రతినిధులు శేషగిరిరావు, వై.సాంబశివరావు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తల అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, సీహెచ్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## భెల్ ఉద్యోగులకు దీపావళి కానుకల అందజేత



దీపావళి కానుకలు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

**అక్కిరెడ్డిపాలెం:** ప్రపంచ పొదుపు దినాన్ని పురస్కరించుకొని భెల్ ఉద్యోగుల సహకార పొదుపు మరియు పరపతి సంఘం యాజమాన్యం వార్షిక బహుమతిగా ఉద్యోగులకు దీపావళి కానులు అందజేసింది. సంస్థలోని కోఆపరేటివ్ బిల్డింగ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్ష,కార్యదర్శులు కొరుపోలు రామునాయుడు, మండ వెంకట్ రాజు మాట్లాడుతూ సంఘ సభ్యుల శ్రేయస్సు దృష్ట్యా తీసుకునే రుణాలపై నవంబరు 1వ తేదీ నుంచి వడ్డీ రేటును 12 శాతానికి తగ్గిస్తున్నట్లు తెలిపారు. సంఘం వార్షిక లాభం నుంచి సభ్యులకు వార్షిక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కె.ధర్మారావు, డైరెక్టర్లు ప్రకాష్, గెద్దాడ ప్రసాద్, కర్రి నాగవరప్రసాద్, ఎస్.బి.ప్రశాంత్ కుమార్, వారణాసి గోవిందరావు, సంఘం మేనేజరు గవర వెంకట రమణారావు, సిబ్బంది ఎం.డి.అమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఇబ్బందులు పట్టవా?

- కూటమి ప్రభుత్వ తీరుపై సీపీఐ నాయకుల ధ్వజం



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

**గాజువాక:** ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని ఆటోనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ అధికారం ఇస్తే విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడు నెలలకే ప్రజలపై భారాలు మోపడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపిస్తోందన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెరుగుదలతో సామాన్యలు ఇబ్బంది పడుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం తన ఉమ్మడి మేనిఫెస్టోలో హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. పెంచిన ట్రూ అప్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి అధికారంలో వచ్చిన తరువాత వాటిని ఏర్పాటు చేయడానికి ఒప్పందం ఎలా చేసుకుంటారని ప్రశ్నించారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ ఏఏవో, ఏడీఈలకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.అచ్యుతరావు, పప్పు అప్పారావు, పల్లేటి పోలయ్య, జి.గురునాథరావు, పి.పోతన్న, కె.వనజాక్షి, కె.పద్మ, సోమేష్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాస శివరాత్రి పూజలు



పూజలు అందుకున్న రామలింగేశ్వరుడు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు దరి ఉమా రామలింగేశ్వర ఆలయంలో బుధవారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని దేవతా మూర్తులను అలంకరించి పూజలు చేశారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి డి.శివరామకృష్ణ సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, నడుపూరు శ్రీనివాస్, సురేంద్ర, ధర్మాల కనకరెడ్డి, నాగభూషణం, సుధాకర్ పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కును అదానీకి అప్పజెప్పడమే అజెండా

- కార్పొరేటర్ గంగారావు



మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

**అగనంపూడి:** విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కారు చౌకగా అదానీ కంపెనీకి అప్పగించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో బుధవారం చేపట్టిన 1357వ రోజు దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. గంగవరం పోర్టును కొట్టేసిన అదానీ వాటిని ఆనుకొని ఉన్న వేలాది ఎకరాల భూమిని కాజేయడానికి కుట్రలు పన్నితే, వాటిని కేంద్ర ప్రభుత్వ పెద్దలు అమలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులను తొలగించడం, వేరే సంస్థల్లోకి బదిలీ చేయడం, స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపించేసి అరకొరగా మిగిలిన ఉద్యోగులతో స్టీల్‌ప్లాంట్‌ను అదానీకి అప్పగించడం కోసం ప్రభుత్వం యత్నిస్తుందని ఆరోపించారు. విశాఖ ఉక్కు నిర్వాసితుల త్యాగం వల్ల వేలాది ఎకరాలు స్టీల్‌ప్లాంట్‌కు దఖలు పడ్డాయని, ఇప్పుడు వారికి కూడా పంగనామాలు పెట్టాలని చూస్తున్నారన్నారు. ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు ఐక్య ఉద్యమం చేపడితే కేంద్రం దిగిరాక తప్పదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, పెదిరెడ్ల నీలకంఠం, శ్రీనివాస్‌రెడ్డి, విందుల నరసింహనాయుడు (కోలాటం నాయుడు), పి.జి.కె.రాజు, నాగేశ్వరరావు, పెంటయ్య, దుర్గాప్రసాద్, పట్టా రమేష్ పాల్గొన్నారు.

### పారదర్శకతతో దేశ ప్రగతి



గ్రామసభలో ప్రసంగిస్తున్న డీజీఎం సుగుణాకరరావు

**ఉక్కునగరం:** విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో దేశపాత్రునిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో గ్రామసభ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ విభాగం డీజీఎం వి. సుగుణాకరరావు మాట్లాడుతూ సంపన్నమైన దేశాన్ని నిర్మించడంలో పారదర్శకత, నిజాయతీ అవసరాన్ని తెలియజేశారు. అవినీతి రహిత కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఉక్కు అధికారులు, గ్రామస్తుస్థులు, విద్యార్థులు సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛత బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎస్. కిరణ్‌కుమార్, కె. రాజేశ్వరరావు, టి. శ్రీనివాసరావు, పి. సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. సుజాత పాల్గొన్నారు.

### విద్యార్థులకు అభినందన



రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం సూర్య ప్రకాశరావు

**అగనంపూడి:** ఈనెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని వచ్చిన కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అండర్ 14 బాలికల పోటీల్లో విశాఖ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సీహెచ్.సంజిత, ఎస్.చాందినీలను కణితి హైస్కూల్ హెచ్ఎం సూర్య ప్రకాశరావు, కె.అరుణ, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం




బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఎస్ఎంఈ అధికారులు

**అక్కిరెడ్డిపాలెం:** స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిశుభ్రత అంశంపై ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో నిర్వహించిన పోటీలో ప్రతిభ కనబర్చిన 10 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషలో నిర్వహించిన పోటీలో 7వ తరగతి విద్యార్థి జర్రి రాజ్యలక్ష్మి, 8వ తరగతి విద్యార్థి రెల్లి ఢిల్లీశ్వరి, 9వ తరగతి విద్యార్థి జి.కొట్ట లక్ష్మి, 10వ తరగతి విద్యార్థులు స్వర్ణ తేజ, చల్లా కుమార్ తేజ విజేతలుగా నిలిచారు. ఇంగ్లిష్‌లో నిర్వహించిన పోటీల్లో 8వ తరగతి విద్యార్థులు రెల్లా కావ్య, ఎస్.షణ్ముఖ ప్రియ, ఎల్.మానస మాధవి, 9వ తరగతి విద్యార్థులు ఎం.హన్సిక, జి.యోషితలు విజేతలుగా నిలిచారు. ఎంఎస్ఎంఈ గ్రేడ్ – 1 ఏడీ చంద్రమౌళి, ఏడీ బి.ప్రభాకర్ కుమార్‌లు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఎంఎస్ఎంఈ ఉద్యోగులు వినోద్ సుబ్బారావు, సన్యాసిరావు, పీడీ ఇస్మాయిల్‌పాల్గొన్నారు.

### మొరాయించిన లిఫ్ట్



**అగనంపూడి:** దువ్వాడ రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ మళ్లీ మొరాయించింది. నాలుగో నంబర్‌ప్లాట్‌ఫారం నుంచి ఒకటికి.. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం నుంచి నాలుగు ప్లాట్‌ఫారాలకు వెళ్లడానికి వీలుగా ఫుట్ ఓవర్ వంతెన పక్కనే లిఫ్ట్‌ను ఏడాది కిందట ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తరచూ లిఫ్ట్ పనిచేయడం మానేస్తుంది. ఈ నెల 26వ తేదీ నుంచి లిఫ్ట్ మళ్లీ పనిచేయడం లేదు. దీంతో లగేజీలు, వృద్ధులు, పిల్లలతో పాట్లు పడాల్సి వస్తుందని ప్రయాణికులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

### బీసీ కులాల సంక్షేమానికి కృషి



రాముకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

**అగనంపూడి:** ఉమ్మడి విశాఖ జిల్లా అత్యంత వెనుకబడిన కులాల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము నియమితులయ్యారు. అగనంపూడికి చెందిన రాము రజక సంఘంతోపాటు బీసీ సంఘాల ప్రతినిధిగా చేస్తున్న సేవలను గుర్తించి వరుసగా మూడో సారి గౌరవాధ్యక్షునిగా నియమిస్తున్నట్టు ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తెలిపారు రాము మాట్లాడుతూ బీసీ కులాల హక్కుల కోసం సమష్టిగా కృషిచేస్తానని తెలిపారు.

### గంజాయి రవాణాను అడ్డుకోవడానికే ఒక ద్వారం

**అగనంపూడి:** దువ్వాడ రైల్వేస్టేషన్ ద్వారా గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న క్రమంలో దాన్ని కట్టడి చేయడానికి రైల్వేస్టేషన్‌లో రెండో ద్వారం మూసివేసినట్టు రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ చెప్పారు. ప్రయాణికులకు అసౌకర్యం కలిగినా తప్పనిసరి చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రెండో ద్వారం తెరవాలని దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ వినతిపత్రం అందించడంతో బుధవారం అసోసియేషన్ కార్యదర్శి కంచుమూర్తి ఈశ్వర్‌తో సమావేశమయ్యారు.గంజాయి రవాణా, టికెట్ తీసుకోకుండా ప్రయాణం చేసే వారికి ఒకే మార్గం వల్ల ఇబ్బందిగా ఉంటుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఒక ద్వారంతో సరిపెట్టామన్నారు.